
సి. జయపాల్ రెడ్డి



# ఒకవే

''రాఘవరావన్నయ్య మిమ్మల్ని అర్జంటుగా రమ్మని కబురు పెట్టాడు'' మధ్యాహ్నం ఇంట్లోకి అడుగుపెడుతూనే నా భార్య సుశీల చెప్పింది.

''ఎందుకట?''

''విషయం చెప్పలేదు. ఇప్పటికి రెండుమూడుసార్లు మనిషిని పంపించాడు''

చెప్పులు విడువకుండానే వాలు కుర్చీలో కూర్చుంటూ ఏమై వుంటుందబ్బా అని ఆలోచనలో పడిపోయాను.

ఆదివారం కావటంతో పొద్దున్నే అలా ఊళ్ళోకెళ్ళివచ్చాను. నేను, రాఘవరావు చిన్నప్పటినుంచి స్నేహితులం. ఇద్దరం టీచర్ ఉద్యోగాల్లో వున్నాం. ఇద్దరం వ్యవసాయ కుటుంబాల్లోంచే వచ్చినా పియుసి వరకు చదువుకోవటంతో అప్పట్లో టీచర్ ఉద్యోగం సులభంగానే లభించింది. మారిన పరిస్థితుల్లో తర్వాతర్వాత ఈ ఉద్యోగం ఎంతో తోడ్పడింది. ఇద్దరికీ వున్న పూళ్ళోనే ఉద్యోగం. వ్యవసాయం కూడా ఉండేది. కాలక్రమంలో రాఘవరావు కూతురు పెళ్ళికి అంతా అమ్మేసుకోగా నేను కూడా కూతురు పెళ్ళికి, కొడుకు చదువుకి కొంత పొలం అమ్మేసుకోగా కొంత మిగిల్చుకుని పేరుకి వ్యవసాయం కూడా ఉందనిపించుకుంటున్నాను. మా పూరు పెరిగి ఇప్పుడు మండల కేంద్రం అయింది.

''కాళ్ళు కడుక్కోండి భోజనం చేద్దురు'' అన్న మా ఆవిడ మాటలతో ఆలోచనలనుండి తేరుకున్నాను.

''మళ్ళీ వచ్చి చేస్తానులే. ఏ అర్జంటు పనో వుండకపోతే ఇన్నిసార్లు రాఘవ మనిషినెందుకు పంపిస్తాడు'' అంటూనే బయటపడ్డాడు.

మా ఇంటినుండి రాఘవ ఇల్లు కనీసం అరకిలోమీటరు దూరం వుంటుంది.

నడుస్తూనే ఏమై ఉంటుందని అన్ని కోణాల నుండి ఊహించటానికి ప్రయత్నించాను.

రాఘవ, నేను మంచి స్నేహితులమే అయినా మా ఇద్దరి ఆలోచనా విధానాల్లో చాలా తేడా వుంది. నేను ఉన్నంతలో మా అబ్బాయికి ఎమ్మెస్సీ వరకు చదువు చెప్పించాను. అందుకు నేను పెద్దగా ఖర్చు పెట్టిందేమీ లేదు. డిగ్రీ నుండి మా అబ్బాయే హాస్టల్ వసతి సంపాదించుకుని ఎమ్మెస్సీ పూర్తి చేశాడు. తర్వాత తనంతటతానే లెక్చరర్ ఉద్యోగం సంపాదించుకున్నాడు.

నేనెప్పుడూ తాహతుకు మించి ఖర్చు చెయ్యలేదు. ఉన్నంతలో కాస్త జీవితాన్ని సరదాగా గడపాలనే తత్వం నాది. పిల్లలకోసం అన్ని కోరికలూ చంపుకుని, త్యాగం చేసి వారిని ఉన్నత స్థాయిలో చూడాలనుకునే మధ్యతరగతి మనస్తత్వం నాది, అమ్మాయికి కూడా డిగ్రీ వరకు చదువు చెప్పించాను. తర్వాత నా స్థాయికి తగినట్లుగానే టీచర్‌కే ఇచ్చి పెళ్ళి జరిపించాను. అలాగే కొడుకు విషయంలో కూడా పెద్దింటి పిల్ల కోసం ప్రయత్నించలేదు. మా స్థాయిలోని అమ్మాయే కోడలుగా వచ్చింది.

కొడుకు, కూతురు కాపురాలు సజావుగానే వున్నాయి. నాకు వున్నంతలో కూతురికీ, కొడుకుకూ బియ్యం, పప్పులు పంపిస్తూనే వున్నాను. ఒకటి, రెండుసార్లు మా అబ్బాయి నాకు ఏదైనా చెయ్యాలనే తపన కనబర్చినప్పుడు నేనే వారించాను. పూళ్ళో మాకన్నీ సవ్యంగానే వున్నాయి. నువ్వు మాకేమీ చెయ్యాల్సిన అవసరం లేదని స్పష్టంగా చెప్పాను.

రాఘవ ఆర్భాటానికి వెళ్ళి తనకంటే మంచి స్థాయిలో వున్న వారింటికి కూతురును కోడలుగా పంపాలని వున్న పొలం అంతా అమ్మి కట్నంగా ఇచ్చి పెళ్ళి చేశాడు. అప్పుడు నేనేం చెప్పినా కొట్టిపారేశాడు. అంతకంటే గట్టిగా చెబితే అసూయపడుతున్నానని అనుకుంటాడేమోనని చెప్పలేదు.

కొడుకు కోసం అప్పుచేసి ఇతర రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ కాలేజీలో లక్షలకు లక్షలు పోసి సీటు కొనుక్కున్నప్పుడు కూడా సున్నితంగానే వారించాను. అయినా రాఘవ వినలేదు. తర్వాత రాఘవ కొడుక్కి హైదరాబాద్‌లో మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది. పెద్దకట్నంతో పెద్దింటి అమ్మాయి కోడలుగా వచ్చింది. ఇవన్నీ చూసి రాఘవ ఆనందానికి అంతులేకుండాపోయింది. వచ్చే జీతమంతా కొడుక్కి పంపించి ఎన్నో కష్టాలు పడి చాలీ చాలని తిండి తిని, మంచి దుస్తులు కొనుక్కోకుండా, కోరికలు చంపుకుని కొడుకు కోసం చేసిన త్యాగం ఊరకే పోలేదని నేనూ సంతోషించాను. అయితే కొన్ని నెలల క్రితం హైదరాబాద్‌లో జరిగిన రాఘవ కొడుకు పెళ్ళికి వెళ్ళినప్పుడు మాత్రం పెళ్ళి మంటపంలో మా అవతారాలు మాకే ఎబ్బెట్టుగా అనిపించాయి. అమ్మాయి వైపువారికి, అబ్బాయి తరపున వెళ్ళిన వారి మధ్య తేడా కొట్టొచ్చినట్లుగా వుంది.

అనుమానించినట్లుగా రాఘవ ఇంటి దగ్గర హడావిడి ఏమీ లేకపోవడంతో కాస్త స్థిమిత పడ్డాను. ఏదో విషయం చర్చించటానికై వుంటుందని అనుకున్నాను. వాకిట్లో నన్ను చూడగానే-

''దామోదరమన్నయ్య వచ్చారండీ'' అంటూ రాఘవ భార్య కేకేసింది. అంటూనే వరండాలోకి కుర్చీలాగి ''కూర్చోండన్నయ్య' అంటూ లోపలికెళ్ళింది.

ఆమె ముఖంలో విచారం కొట్టొచ్చినట్లుగా వుంది.

స్నానం చేసినట్లున్నాడు. బొట్టు పెట్టుకుంటూ వరండాలోకి వచ్చాడు రాఘవ.

''ఎక్కడికెళ్ళావురా దామోదరం- పొద్దుట్నుంచి ఇంట్లో లేనట్లున్నావు'' మరో కుర్చీ లాక్కుని నా ఎదురుగా కూర్చుంటూ అన్నాడు.

''ఏదో చిన్న పని వుండి బజారెళ్ళానులే- ఇంతకీ విషయం ఏమిటీ అర్జంటుగా రమ్మన్నావుట'' ఉపోద్ఘాతం లేకుండా విషయంలోకి వచ్చాను.

ఒక్కసారిగా రాఘవ ముఖంలో విషాదం, దిగులు కన్పించాయి. కాసేపు మౌనంగా వుండిపోయాడు.

''నువ్వన్నంత అయింది. ఇప్పుడేం చెయ్యాలో అర్థం కావటం లేదు''

నేనేం మాట్లాడలేదు.

''మీకు తెలుసుగా వాడి చదువుకోసం, ఉద్యోగం కోసం చాలా అప్పు చేశాను. పెళ్ళికి వాడి మామ కట్నం నాకివ్వకుండా వాడి పేరనే బ్యాంకులో వేశాడు. పెళ్ళి తర్వాత తీసుకున్న అప్పు తీర్చవచ్చులేనని ఊరుకున్నాను. ఆరు నెలలయినా వాడేమీ అనకపోవడంతో ఉత్తరం రాశాను డబ్బు పంపమని. ఏమని జవాబు రాశాడోచూడు'' అంటూ ఉత్తరం నా చేతికిచ్చాడు.

వేరే వాళ్ళ ఉత్తరం చదవటం బాగుండదని అలాగే పట్టుకున్నాను.

''చదువు. అంత చదవగూడని విషయాలేమీ లేవులో అందులో''

రాఘవ అలా అనటంతో ఇక ఉత్తరం చదవక తప్పలేదు.

సిటీలో ఇల్లు కొనుక్కోవాలి, ఇంట్లోకి చాలా వస్తువులు కొనాలి, కారు కొనాలి కాబట్టి చాలా డబ్బు అవసరం అవుతుంది కాబట్టి ఇప్పట్లో డబ్బేమీ ఇవ్వలేను- ఇదీ ఉత్తరం సారాంశం.

రాఘవ వైపు చూశాను.

కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

''నాకింకా రెండేళ్ళ సర్వీసు మాత్రమే వుందని నీకు తెలుసుకదా- ఇంత అప్పు ఎలా తీర్చాలి''

(మిగతా 29వ పేజీలో)

# ఒన్ వే

(27వ పేజీ తరువాయి)

గద్గద స్వరంతో అన్నాడు రాఘవ. ముక్కు చీదడం వినిపించటంతో పక్కకి తిరిగి చూశాను. ఎప్పుడొచ్చిందో రాఘవ భార్య జానకి తలుపు చాటున నిలబడి ఏడుస్తోంది. కొడుకు కోసం తను ఎంత త్యాగం చేసిందీ ఏకరువు పెట్టాడు రాఘవ. మంచి ఉద్యోగం వస్తే తమను ఆదుకుంటాడని, మంచి కట్నంతో కోడలు వస్తే తమను మేడల్లో వుంచి కార్లలో తిప్పుతాడని ఎలా ఆశపడిందీ చెప్పాడు.

ఆ తర్వాత కొడుకును కసితీరేంతవరకూ తిట్టాడు. ఇలాంటి కొడుకు ఎవరికీ వుండకూడదని శాపనార్థాలు పెట్టాడు.

ఇదంతా కొత్త కోడలు పనేనని జానకి కోడలిని, తర్వాత కోడలి మాటలు వింటూ తమని పట్టించుకోవటం లేదని కొడుకునీ కలిపి తిట్టింది.

ఇంక తిట్టాల్సిందీ ఏమీ లేకపోవడంతో ఇద్దరూ సేపు మౌనంగా వుండిపోయారు.

నేనూ ఏమీ మాట్లాడలేదు.

ప్రతి మధ్య తరగతి ఇంటిలోనూ జరిగే తంతే ఇది.

'ఏం చెయ్యమంటావురా'' నావైపు చూస్తూ బేలగా అడిగాడు.

''ఏం చేస్తావు కొడుకు సుఖంగా వున్నాడని సంతోషించండి''

''అంటే మేం చేసిన త్యాగం అంతా వృధాయేనంటావా?''

''ప్రతిఫలాన్ని ఆశిస్తే అది త్యాగం కాదు''

''మరి మేం చేసిన ఖర్చంతా ఎవరిస్తారు'' కాస్త ఖంగుతిన్నట్లుగా అడిగాడు.

''పిల్లలంటే వ్యవసాయం కాదు, పరిశ్రమ అంతకంటే కాదు పెట్టుబడి పెట్టి లాభాలార్జించటానికి. తమ కోరికల్ని, ఆశయాలను పిల్లలపై రుద్ది ఫలితాలను ఆశించటం ప్రతి మధ్య తరగతి తల్లిదండ్రులు చేసే పనే. ఇదంతా తమ స్వార్థం కోసమే తప్ప పిల్లలపై ప్రేమతో కానే కాదు.

''నీకేమిటి గడ్డపైనున్నావు ఎన్నైనా మాట్లాడతావు'' నిష్ఠూరంగా అన్నాడు రాఘవ.

''వాస్తవం మాట్లాడితే నిష్ఠూరంగానే వుంటుందిరా- తల్లిదండ్రులెప్పుడూ పిల్లలకు పెట్టే స్థితిలో వుండాలేకాని ఆశించే స్థితిలో కాదు. పిల్లలు తమకేమీ చెయ్యటంలేదని తమను నిర్లక్ష్యం చేస్తున్నారని నిందించటం సరైంది కాదు. మనం మన పిల్లల ఆలనా పాలనా చూస్తే వాళ్లు వాళ్ళ పిల్లల ఆలనా పాలనా చూస్తారు. ప్రతి తల్లీ తండ్రీ తమ పిల్లలు తమకంటే వున్నంతగా వుండాలని కోరుకుంటారు, అదే న్యాయం కూడా- అంటే ఇది ఒన్వే లాంటి దన్నమాట''

''రాఘవ, జానకి నావైపు వింతగా చూస్తుండిపోయారు''

''అంటే పిల్లలు తల్లిదండ్రులను పట్టించుకోకూడదని కాదు. అలాంటివారు లేరనీ కాదు. అలా వుంటే మంచిదే కాని తల్లిదండ్రులు వారిపై ఆశలు పెట్టుకొని, త్యాగాలు చేసి, తాహతుకు మించిన పనులు చేసి తర్వాత మోసపోయామని కొడుకులను నిందించటం సరైంది కాదు. మొత్తంగా ఈనాటి మధ్య తరగతి తల్లిదండ్రుల మనస్తత్వం మారాలి. ఇక ముందైనా జాగ్రత్తగా వుండాలి.

ఆవేశంగా అని వాళ్ళ వైపు కూడా చూడకుండా లేచి వచ్చేశాడు.

★

# డెత్‌సీన్

(21వ పేజీ తరువాయి)

అగాధంలో పడి అతను నుజ్జునుజ్జవుతున్నా ఆగలేదు రాళ్ళవర్షం....

★ ★ ★

విశ్వజిత్, రసికల కవి ఉద్విగ్నభరిత క్షణాలు. ఇక ఏ అవరోధములేకుండా పది లక్షలు చేతిలో పడతాయి!

ఇన్‌స్పెక్టర్ ఆర్ముగం వచ్చి ప్రమాదస్థలాన్ని చూశాడు. అక్కడ ఆరడుగుల మేర కూలిపోయింది గోడ. చాలావరకు రాళ్ళు అటు లోయలో పడ్డాయి. మేస్త్రీని పెడదామంటే వినిపించుకోకుండా రాజేష్ తనే గోడ కట్టేడన్నాడు విశ్వజిత్. గోడ వొరుగుతోంది, పని మానుకోమంటే కూడా వినక చేతులారా ఇది తెచ్చుకుని తన కూతుర్ని దగా చేశాడన్నాడు. ఇది ప్రమాదవశాత్తూ జరిగిన మరణంగానే అభిప్రాయపడ్డారు ఇన్‌స్పెక్టర్ ఆర్ముగం. పంచనామా పూర్తిచేసి శవాన్ని క్రేన్ సాయంతో పైకి ంచాడు.

ఆ రాత్రి తండ్రీ కూతుళ్ళు రహస్యంగా కార్లో బయల్దేరారు. వాళ్ళ ఆనందానికి అవధుల్లేవు. ఆ ఆనందంలో తమని ఒక ఆకారం వెంటాడుతున్న సంగతి గమనించలేదు. మరో ఆకారం ఇటు తమ ఇంట్లో జొరబడిందని కూడా తెలీదు. ఇంట్లోకి జొరబడిన ఆకారం లైట్లు వేయకుండా టార్చి సాయంతో ముందుగదిలో కాగితాల్ని చూసింది. ఆ తర్వాత వెనుక పెరట్లోకీ, గల్లీలోకీ వెళ్ళి తిరిగి వచ్చింది. ఈసారి సొరుగులో కాగితాల్ని పరిశీలిస్తూ ఉలిక్కిపడింది. వెంటనే ఆ రెండు కాగితాల్ని హస్తగతం చేసుకుని వెళ్ళిపోయింది.

రాత్రెప్పుడో తిరిగి వచ్చిన విశ్వజిత్, రసికలో తాళం విరిగి వుండడం చూసి ఉలిక్కిపడ్డారు.

తెల్లవారుతూండగానే ఇంటిముందు పోలీసు జీపాగడంతో అదిరిపడ్డారు-

★ ★ ★

''మిస్టర్ విశ్వజిత్, నువ్వు తప్పుడు స్టేట్‌మెంటిచ్చి మమ్మల్ని ప్రక్కదోవపట్టించబోయావ్. జరిగింది. ప్రమాదమని నమ్మించబోయావ్. బట్ ఇట్స్‌ప్లెయిన్ మర్డర్!''

''వాట్!'' అరిచాడు విశ్వజిత్, అంతెత్తుకెగిరి.

పోలీసులు ఒక ఆరడుగుల ఇనప ప్లేటుని, కేబుల్స్‌నీ తెచ్చి పడేశారు లోపల.

దిమ్మెరపోయాడు విశ్వజిత్. కొయ్యబారిపోయింది రసిక.

''రాత్రి మాకెవరో ఫోన్‌చేశారు... నువ్వూ నీ కూతురూ వీటిని కారు డిక్కీలో పెట్టుకుని వెళ్ళి షేక్‌పేట అవతల పారేసొచ్చారు.''

''నో! ఇవి మావికావు! యూ కాంట్ ప్రూవిట్!''

''ఎస్. ఇట్ కెన్ బి ప్రూవ్డ్...'' మాటలు వినిపించాయి.

గిరుక్కున తిరిగారు - గుమ్మంలో అక్బర్.

''విశ్వజిత్, నువ్వు పచ్చి ఖూనీకోరువి... ఇన్స్‌పెక్టర్, వీళ్ళు డబ్బుకి మొహం కాచివున్నారు. వీళ్ళ చరిత్ర చెప్పినా విన్లేదు నా ఫ్రెండ్ రాజేష్. తెలివిగా వాణ్ణి ట్రాప్‌చేసి పది లక్షలకి ఇన్స్యూర్ చేయించారు. నామినీ ఈ పిల్ల. సినిమాల్లో డెత్‌సీన్లని అద్భుతంగా తీస్తాడని పేరుబడ్డ ఇతను నిజజీవితంలోనూ రెండు డెత్‌సీన్లు సృష్టించాడు... మొదటిది భార్యది, రెండోది నా ఫ్రెండ్‌ది. కావాలంటే వెళ్ళి చూడండి - అక్కడ గోడపడిపోయిన చోట బేస్‌మెంట్‌కి, అంటే బండకి సిమెంట్ లేదు! సిమెంట్ పర్చకుండా రాళ్ళెలా పేర్చారు? ఈ ప్లేటు పెట్టారు కాబట్టి సిమెంట్ వేయలేదు. ఈ ప్లేటు ఈజీగా కదిలి రావాలి కాబట్టి సిమెంట్ని ఎవాయిడ్ చేశారు. సిమెంట్ ప్లేటుకి ఒకవైపు వుంది చూడండి... ఈ ప్లేటుకి ఈ కేబుల్స్ బిగించి కారు సాయంతో లాగారు - గోడ కూలింది. కావాలంటే కారు బంపర్‌కి అక్కడ నికెల్ పూడింది చూడండి! గల్లీలో కారు టైర్లు స్కిడ్ అయిన గుర్తులు, కేబుల్స్ పాతిపెట్టిన ఆనవాళ్ళుంటాయి వెళ్ళి చూడండి!''

''షటప్! స్టిల్ యూకెనాట్ ప్రూవ్!''

''యస్, ఐకెన్ ప్రూవ్ బై ఆల్ మీన్స్..'' అని జేబులోంచి కాగితాన్ని తీసి చూపించాడు అక్బర్. అది చూసి లాక్కోబోయాడు విశ్వజిత్. ఆర్ముగం దాన్ని తీసేసుకున్నాడు. ఆ కాగితాన్ని చూస్తుంటే అతడి మొహం ఎరుపెక్క సాగింది... అది బిల్లు... హార్డ్‌వేర్ షాపు బిల్లు... తాపీలు, టెంకెలు, పారలతో బాటు ఇనప ప్లేటు, కేబుల్స్, హుక్స్ కొనుగోలు చేసిన బిల్లు...

రెచ్చిపోయి విశ్వజిత్ మృగంలా పడ్డాడు అక్బర్ మీద.

ఇన్స్‌పెక్టర్ ఆర్ముగం దూరంగా లాగాడు. అక్బర్ ఇంకో కాగితం అందించాడు - అది ఇన్సూరెన్స్ పాలసీ.

విశ్వజిత్ రసికలు బయట జీపెక్కుతున్నప్పుడు పెద్ద సంఖ్యలో గుమికూడి చూశారు. జనం. తమ మధ్య నాగులు వున్నాయనుకోలేదు వాళ్ళు.

★

